సాక్షి
అనకాపల్లి

బుధవారం । 21 । ఆగస్టు । 2024



వెండి ధనస్సుకు పూజలు

విశాఖ: పెదవాల్తేరు శివాలయంలో మంగళవారం అయోధ్య రాముడి వెండి ధనస్సును భక్తుల దర్శనార్థం ప్రదర్శించారు.



సిగ్గుచేటు

కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారానికి నిరసనగా జిల్లాలో పలుచోట్ల నిరసన ప్రదర్శనలు జరిగాయి.

8లో

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉండి తేలిక పాటి జల్లులు పడే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం పేర్కొన్నారు. ఈనెల 21న 10 మి.మీ, 22న 6 23న 8, 24న 13, 25న 6 మి.మీ వర్షపాతం నమోదవుతుందన్నారు.

న్యూస్‌రీల్

నేడు ఏయూ పరిధిలో పరీక్షలు వాయిదా

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో బుధవారం జరగాల్సిన యూజీ, పీజీ, ప్రొఫెషనల్ పరీక్షలు వాయిదా వేసినట్లు ఏయూ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జె.రత్నం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న భారత్ బంద్ సందర్భంగా విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. మళ్లీ పరీక్ష తేదీని ఏయూ వెబ్‌సైట్ ద్వారా ప్రకటిస్తామని వెల్లడించారు. అలాగే బంద్ కారణంగా ఏయూ క్యాంపస్‌కు బుధవారం సెలవు ప్రకటించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిశోర్ తెలిపారు.

పూడిమడక హార్బర్ నిర్మాణ స్థలం పరిశీలన

- బెంగళూరు నుంచి వచ్చిన సీసెఫ్ బృందం
- వ్యయం తగ్గించే అవకాశాలపై అధ్యయనం
- వారం రోజుల్లో నివేదిక ఇచ్చే అవకాశం



హార్బర్ నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న సీసెఫ్, మారిటైం, ఫిషరీస్ అధికారులు

అచ్యుతాపురం: రాష్ట్రంలోనే అత్యంత పెద్ద జాలరి పల్లెగా గుర్తింపు ఉన్న పూడిమడక తీరంలో నిర్మించనున్న హార్బర్ ప్రతిపాదిత స్థలంలో సెంట్రల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆఫ్ కోస్టల్ ఇంజనీరింగ్ ఫర్ ఫిషరీస్ (సీసెఫ్) బృందం మంగళవారం పర్యటించింది. బెంగళూరుకు చెందిన ఈ బృందం హార్బర్ నిర్మాణానికి గతంలో ఆమోదించిన నిధుల కంటే తక్కువ నిధులతో నిర్మాణం చేపట్టవచ్చా? లేదా? అనే అంశంపై కసరత్తు చేయనుంది. నిధుల ఖర్చులో మిగులు అవకాశాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు సీసెఫ్ డిప్యూటీ డైరెక్టర్ బెల్లయప్ప ఆధ్వర్యంలో తీరంలో పర్యటించింది. ఖర్చు తగ్గింపు అవకాశాలను అధ్యయనం చేసి వారం రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. గత ప్రభుత్వ హయాంలో హార్బర్ నిర్మాణానికి రూ.389 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే అచ్యుతాపురం పూడిమడక రహదారి నుంచి హార్బర్ నిర్మాణ ప్రతిపాదిత తీరానికి చేరుకునేందుకు అవసరమైన మార్గాన్ని దాదాపు పూర్తి చేశారు. కార్యక్రమంలో మెరైన్ జేడీ వెంకటేశ్వరరావు, ఏపీ మారిటైం బోర్డు ప్రతినిధి శివశంకర్, జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాద్, అచ్యుతాపురం మత్స్యశాఖ అధికారి రవితేజ, ఏడీ జాస్మిన్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



మాడుగుల: శ్రావణ మంగళవారం కావడంతో ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రత్యేక కుంకుమ పూజలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారిని నగలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ భక్తులకు ప్రసాదం, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేసింది.

కోలుకుంటున్నారు..



కేజీహెచ్ పిల్లల వార్డులో చికిత్సను పర్యవేక్షిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద



కేజీహెచ్‌లో కోలుకుంటున్న చిన్నారులు

- విషాహారంతో ఆస్పత్రి పాలైన చిన్నారులు క్షేమం
- అధికారులు అప్రమత్తం కావడంతో మరింతమందికి వైద్యసేవలు



కోటవురట్ల సీహెచ్‌సీలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఆర్డీ రామగిద్దయ్య

మహారాణిపేట (విశాఖ)/కోటవురట్ల/నర్సీపట్నం: కోటవురట్ల మండలం కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో ఆహారం కలుషితమై అస్వస్థతకు లోనైన చిన్నారులు వివిధ ఆస్పత్రుల్లో క్రమంగా కోలుకుంటున్నారు. పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన (పాసా) ట్రస్ట్ నిర్వహిస్తున్న ఆశ్రమంలో ఆశ్రయం పొందిన అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గిరిజన బాలల్లో ముగ్గురు నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వాంతులు, విరేచనాలతో బాధ పడుతున్న 35మందికి విశాఖ కేజీహెచ్‌తో పాటు అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని పలు ఆస్పత్రుల్లో సోమవారం చికిత్స అందించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన అధికారులు కలుషిత ఆహారం తిన్న మరింతమంది ఏజెన్సీ బాలలను గుర్తించి మంగళవారం ఆస్పత్రులకు తరలించారు. ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌లో 38మంది, విశాఖ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో ఇద్దరు, రెయిన్‌బోలో ఒకరు, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 22మంది, కోటవురట్ల కమ్యూనిటీ ఆస్పత్రిలో ఐదుగురికి వైద్య సేవలు అందిస్తున్నారు.

విశాఖ కేజీహెచ్‌లో..

పాసా ట్రస్టు ఆశ్రమంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన 41 మంది పిల్లలను విశాఖ తీసుకొని వచ్చారు. ఇందులో కేజీహెచ్ పిల్లల వార్డులో 38 మంది చికిత్స పొందుతున్నారు. వీరికి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ పర్యవేక్షణలో పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవరి, ఇతర వైద్యులు సేవలు అందించారు. ఇందులో అయిదుగురి పరిస్థితి కొద్దిగా విషమంగానే ఉంది. పి.జెస్సికా, పి.మౌనికలను కిమ్స్ ఆస్పత్రికి, ఎస్.రవిని రైయిన్ బో ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న బాలల వివరాలు
విశాఖ కేజీహెచ్‌లో 38మంది
విశాఖ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ముగ్గురు
నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 22మంది
కోటవురట్ల కమ్యూనిటీ ఆస్పత్రిలో ఐదుగురు

చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన ఆర్డీ

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 22 మంది గిరిజన విద్యార్థులను, కోటవురట్ల సీహెచ్‌సీలో ఉన్న ఐదుగురిని వైద్య విధాన పరిషత్ రీజనల్ డైరెక్టర్ రామగిద్దయ్య మంగళవారం పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి ఆస్పత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వీరజ్యోతి ఆర్డీకి వివరించారు. పూర్తిగా కోలుకున్నాక మాత్రమే విద్యార్థులను ఇళ్లకు పంపించాలని ఆర్డీ వైద్యులకు సూచించారు. విద్యార్థులు కోలుకునేందుకు మెరుగైన వైద్యంతోపాటు భోజనం, పండ్లు అందిస్తున్నామని వీరజ్యోతి తెలిపారు. ఆయన వెంట జిల్లా వైద్యాధికారి బాలాజీ, ప్రోగాం ఆఫీసర్ ప్రశాంతి, డాక్టర్ సంతోష్‌కుమార్, ఎంపీహెచ్‌వో గోవిందరావు ఉన్నారు. ఏఎస్ఆర్ జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి శిరీష ఆస్పత్రిలో ఉండి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు.

పాసా ట్రస్ట్ సీజ్

విషాహారంతో ముగ్గురు విద్యార్థుల మృతికి కారణమైన పాసా ట్రస్ట్‌ను అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు అధికారులు సీజ్ చేశారు. నిర్వాహకుడు, పాస్టర్ కిరణ్‌కుమార్‌పై ఐపీసీ పాత సెక్షన్ 304, భారతీయ న్యాయ సంహిత చట్టం 105 ప్రకారం కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అనుమతి లేకుండా.. వసతులు కల్పించకుండా..

చిల్డ్రన్ హోం నిర్వహణ



వసతి గృహం తనిఖీ చేసి విద్యార్థులను విచారిస్తున్న అధికారులు

- కొండవెనుకపాలెంలో ఏర్పాటు
- 56 మంది విద్యార్థినీ విద్యార్థులకు వసతి
- అధ్వానంగా హాస్టల్ పరిసరాలు.. అధికారుల తనిఖీలో వెల్లడి

నక్కపల్లి: ఉపమాక శివారు కొండవెనుకపాలెంలో అనుమతులు లేకుండా చిల్డ్రన్ హోం నిర్వహిస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. కోటవురట్ల మండలం కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో పాసా ట్రస్టు ఆశ్రమంలో ఆహారం కలుషితమై ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటనతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. మంగళవారం నక్కపల్లి మండలంలో తహసీల్దార్ అంబేడ్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవో కుంచం నరేష్, సీడీపీవో శ్రీవిద్యలతో కూడిన బృందం తనిఖీలు నిర్వహించారు. ఉపమాక శివారు, మారుమూల ప్రాంతమైన కొండవెనుకపాలెంలో జీసీఎం, లవ్ ఇన్ యాక్షన్ పేరుతో ఒక మైనార్టీ సంస్థ ఈ హాస్టల్‌ను నిర్వహిస్తోంది. ఈ హాస్టల్‌లో కోటవురట్ల, గొలుగొండ, కాకినాడ జిల్లా పిఠాపురం ప్రాంతాలకు చెందిన 56 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. వీరంతా ఎస్.నర్సాపురం ప్రాథమిక పాఠశాల, నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ కళాశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్నట్లు అధికారులు గుర్తించారు. 24 మంది బాలికలు, 24 మంది బాలురు హాస్టల్‌లో ఉంటున్నారు. ఇదే హాస్టల్ చదువుకున్న మరో ఎనిమిది మంది వీరందరికీ సంరక్షకులుగా ఇక్కడే ఉంటున్నట్లు అక్కడ విద్యార్థులు తెలిపారు.

నాలుగేళ్ల నుంచి అనుమతి లేకుండా..

ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే నాలుగేళ్ల నుంచి హాస్టల్ నిర్వహిస్తున్నట్లు అధికారుల తనిఖీలో వెల్లడయింది. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లుగా సదుపాయాలు లేవు. స్థలాన్ని లీజుకు తీసుకుని రేకుల షెడ్లు వేసి హాస్టల్ నిర్వహిస్తున్నారు. పరిసర ప్రాంతాలు, విద్యార్థులు ఉండే గదులు అధ్వానంగా ఉన్నాయి. ఇరుకు గదుల్లోనే ఐరన్ మంచాలు, చాలీచాలని వసతితోనే ఈ వసతి గృహం నిర్వహిస్తున్నారు. మొత్తం 56 మందికి గాను నాలుగు గదులు మాత్రమే ఉన్నాయి. ఈ గదుల్లోనే మంచాలు వేసి విద్యార్థులకు వసతి సదుపాయం కల్పించారు. వంట గదుల పక్కనే టాయిలెట్లు ఉన్నాయి. ఆవరణ అంతా దుర్గంధం వెదజల్లుతోంది. తమ సమస్యలు చెప్పుకోడానికి విద్యార్థులు భయపడుతున్నారు. నైట్ వాచ్‌మన్, వార్డెన్ అందుబాటులో ఉంటున్నారని, భోజనం బాగానే ఉంటోందని వారు చెప్పారు. నిర్వాహకులు ఒక మైనార్టీ ట్రస్ట్ నిర్వహిస్తున్నారు. ట్రస్ట్ పేరుతోనే చిల్డ్రన్స్ హోమ్ హాస్టల్ నిర్వహిస్తున్నారు. ట్రస్ట్‌కు అనుమతి ఉన్నప్పటికీ హాస్టల్‌కు అనుమతి లేదని తెలిసింది. తక్షణమే వారిని మండల కేంద్రంలోఉన్న వసతి గృహాలు, లేదా కేజీబీవీ, గురుకుల పాఠశాలలకు తరలించాల్సి ఉంది. బాలికల్లో మేజర్లు కూడా ఉన్నారు. వారికి తక్షణమే రక్షణ కల్పించాల్సి ఉంది.



కొండవెనుకపాలెంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న హాస్టల్



చిల్డ్రన్ హోం బోర్డు

డీఈవోకు నివేదిక సమర్పించాం: ఎంఈవో నరేష్

జీసీఎం సంస్థ లవ్ ఇన్ యాక్షన్ పేరుతో నిర్వహిస్తున్న చిల్డ్రన్స్ హోమ్‌కు ఎటువంటి అనుమతి లేదని మండల విద్యాశాఖాధికారి కుంచం నరేష్ తెలిపారు. తమ పరిశీలనలో గమనించిన విషయాలను జిల్లా విద్యా శాఖాధికారికి తెలియజేశామన్నారు. జిల్లా అధికారుల నుంచి ఆదేశం వచ్చిన వెంటనే ఇక్కడి పిల్లలను వేరే చోటకు తరలించే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఏజెన్సీలో రెండు హాస్టళ్లు సీజ్

సాక్షి, పాడేరు, చింతపల్లి: అనంతగిరి, చింతపల్లి మండలాల్లో రెండు వసతి గృహాలను అధికారులు మంగళవారం సీజ్ చేశారు. చింతపల్లిలో లెనీ చిల్డ్రన్ హోమ్‌ను 13 ఏళ్లగా అనధికారికంగా నిర్వహిస్తున్నారు. కోటవురట్ల మండలం కైలాసపట్నం ఘటనతో అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం తనిఖీలు చేపట్టింది. స్థానిక లెనీ చిల్డ్రన్ హోమ్‌లో ఒకటి నుంచి డిగ్రీ వరకు చదివే 23 మంది విద్యార్థులను కనీస సౌకర్యాలు కల్పించకుండా ఒకేచోట ఉంచడాన్ని కమిటీ సభ్యులు గుర్తించారు. సంస్థ నిర్వహణకు సంబంధించి ఎటువంటి రికార్డులను నిర్వాహకురాలు సునీత చూపించకపోవడంతో అనధికారికంగా నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. విద్యార్థులకు అందించే మెనూ వివరాలు కూడా అందుబాటులో లేవు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లిపోవడంతో వారిని ప్రశ్నించే అవకాశం లేకుండా పోయింది. దీంతో లెనీ చిల్డ్రన్ హోమ్‌కు మండల కమిటీ సభ్యులైన తహసీల్దార్ రామకృష్ణ, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, ఎంఈవోలు ప్రసాద్, బోడంనాయుడు, ఏటీడబ్ల్యూవో జయలక్ష్మి, సీఐ రమేష్, ఎస్ఐ అరుణ్‌కిరణ్, ఆర్ఐ కృష్ణమూర్తి సీజ్ చేశారు. చిల్డ్రన్ హోమ్‌ను సీజ్ చేసిన నేపథ్యంలో వారి చదువుకు ఎలాంటి అవరోధం కలగరాదన్న భావనతో సమీప ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించనున్నట్టు మండల కమిటీ తెలిపింది.



గిరిజన విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్



లెనీ చిల్డ్రన్ హోమ్‌కు తాళం వేస్తున్న అధికారులు

అనంతగిరి మండలంలో..

అనంతగిరి మండలం కాశీపట్నంలో అనధికారికంగా నిర్వహిస్తున్న హోలీ స్పిరిట్ మిషనరీ వసతి గృహాన్ని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సీజ్ చేశారు. మంగళవారం హాస్టల్‌ను తనిఖీ చేసిన పీవో నిర్వాహకులను విచారించారు. గిరిజన విద్యార్థులతో మాట్లాడారు. వారు చదువుతున్న పాఠశాలల వివరాలతో పాటు వారి స్వగ్రామాలు, తల్లిదండ్రుల సమగ్ర సమాచారాన్ని ఆయన తెలుసుకున్నారు. వసతిగృహం నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవని గుర్తించిన పీవో ఇక్కడ చదువుకుంటున్న 37 మంది గిరిజన విద్యార్థులను సమీప గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు తాత్కాలికంగా తరలించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు చర్యలు చేపట్టారు.

ప్రేరణ ఉత్సవ్‌కు ఇద్దరు విద్యార్థులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల 12వ తరగతి విద్యార్థిని దిగుమర్తి వైష్ణవి, నర్సీపట్నం జెడ్పీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి పి.హర్షవర్ధన్ ప్రతిష్టాత్మక ప్రేరణ ఉత్సవ్ 2024కు ఎంపికయ్యారు. నవోదయ విద్యాలయ సమితి పర్యవేక్షణలో కొమ్మాది నవోదయ విద్యాలయంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో గెలుపొంది జిల్లా నుంచి వీరిద్దరూ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.ఎం.పట్నాయక్ మంగళవారం రాత్రి సాక్షికి తెలిపారు. త్వరలో గుజరాత్‌లో వారం రోజులు జరిగే ప్రేరణ శిక్షణలో ఈ ఇద్దరు పాల్గొననున్నారు. ప్రధాని మోదీతో విద్యార్థులు మాట్లాడే అవకాశం కల్పిస్తారు. దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు ఈ ప్రేరణ ఉత్సవ్‌లో పాల్గొనేలా ఎంపికలు జరిగాయి. వచ్చే అక్టోబర్‌లో గుజరాత్ వాద్‌నగర్‌లో ఉన్న పాఠశాలలో వారం రోజులపాటు బస చేసేలా ఏర్పాట్లు చేస్తారు. జాతీయ విద్యావిధానం 2020లో భాగంగా దేశంలోని యువతలో నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, విలువలతో కూడిన విద్య అలవర్చడం, యువసాధికారత సాధనే లక్ష్యంగా ప్రేరణ ఉత్సవ్‌ను కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ అమల్లోకి తీసుకొచ్చింది. ఈ ప్రయోగాత్మక అభ్యసన కార్యక్రమంలో భాగంగా ఎంపికైన విద్యార్థులను రోజువారీ కార్యక్రమాల్లో భాగంగా యోగా, మెడిటేషన్, సెషన్‌లు ఉంటాయి. అనంతరం వివిధ అభ్యసన కార్యక్రమాలు ఉంటాయి.

మరో నలుగురు చిన్నారులు రెస్క్యూ

- అనకాపల్లి నుంచి తీసుకువచ్చిన గాజువాక పోలీసులు
- శిశు కేంద్రానికి తరలింపు
- ఇప్పటికే కేంద్రంలో పాల డబ్బాలకు కూడా డబ్బులు లేవు..!
- తల్లిదండ్రులు లేకపోవడంతో గుక్కపెట్టి ఏడుస్తున్న పిల్లలు

విశాఖ సిటీ: శిశు విక్రయాల కేసులో పోలీసులు మరింత స్పీడ్ పెంచారు. మరో నలుగురు చిన్నారులను సురక్షితంగా విశాఖకు తీసుకువచ్చారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో 17 మంది అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేసి ఆరుగురు చిన్నారులను రక్షించిన విషయం తెలిసిందే. ఈ ముఠా ఇప్పటికే 15 మంది శిశువులను విక్రయించినట్లు విచారణలో గుర్తించారు. దీంతో వీరిని రెస్క్యూ చేసేందుకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రత్యేక బృందాలను అనకాపల్లి, ఢిల్లీ, ఇతర ప్రాంతాలకు పంపించారు. ఇందులో ఒక బృందం మంగళవారం నలుగురు చిన్నారులను అనకాపల్లిలో గుర్తించి సురక్షితంగా గాజువాక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు సమాచారం. వీరిని మర్రిపాలెం ప్రాంతంలో ఉన్న శిశు గృహానికి తరలించనున్నారు. మిగిలిన చిన్నారుల ఆచూకీ గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే దేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఈ ముఠా సభ్యులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టారు. పూర్తి స్థాయిలో ఈ గ్యాంగ్‌కు చెక్ పెట్టాలని గట్టి నిర్ణయంతో ఉన్నారు. ఇందులో కొన్ని ఆస్పత్రులు, వైద్యుల ప్రమేయంపై కూడా ఆరా తీస్తున్నారు. త్వరలోనే మరికొన్ని అరెస్టులు చూపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

చిన్నారులతో నిండిపోయిన శిశు కేంద్రం

అంతర్రాష్ట్ర ముఠా విక్రయించిన శిశువులను తీసుకువచ్చిన పోలీసులు చిన్నారులను మర్రిపాలెం ప్రాంతంలో ఉన్న శిశు కేంద్రంలో ఉంచుతున్నారు. ఇప్పటికే ఆరుగురిని అక్కడ చేర్పించారు. అప్పటికే ఆ కేంద్రంలో కొంత మంది చిన్నారులు ఉన్నారు. వారికే ప్రస్తుతం పాల డబ్బాలకు కూడా డబ్బులు లేని పరిస్థితి ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రస్తుతం కొత్తగా తీసుకువచ్చిన చిన్నారులను మళ్లీ అదే కేంద్రంలో అప్పగిస్తే మరింత భారం పడే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని కేంద్రం సిబ్బంది పోలీసుల దృష్టికి తీసుకువెళ్లినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా కొత్తగా చిన్నారులను ఈ కేంద్రానికి తీసుకురావద్దని పోలీసులను కోరినట్లు తెలిసింది. దీనిపై పోలీసులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే ఆలోచనలో ఉన్నారు. ఇదిలా ఉంటే రక్షించిన చిన్నారులు గుక్కపెట్టి ఏడుస్తుండడంతో వారిని సముదాయించడం అక్కడి సిబ్బంది వల్ల కావడం లేదు. నిన్న మొన్నటి వరకు పెంచిన తల్లిదండ్రుల వద్ద అలవాటు పడిన చిన్నారులు ఇప్పుడు కొత్త వ్యక్తుల మధ్య ఉండలేకపోతున్నారు. ఇప్పుడు వీరిని ఎలా సముదాయించి, తరువాత ఏం చేయాలన్న విషయంపై అధికారులు సైతం మల్లగుల్లాలు పడుతున్నారు.

డేంజరస్.. బ్రూసెల్లోసిస్!

బ్రూసెల్లోసిస్ అనేది పశు సంపదను నిర్వీర్యం చేసే ప్రమాదకరమైన వ్యాధి. ఇది బ్రూసిల్లా అబార్టస్ బ్యాక్టీరియా వల్ల సోకుతుంది. ఈ సూక్ష్మజీవులు పశువుల జననేంద్రియాలు, పొదుగును ఆశించి వ్యాధిగ్రస్తం చేస్తాయి. ఈ వ్యాధి సోకితే పశువులు మరణిస్తాయి. మనుషులకు అంటుకుంటే తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతారు. ఈ నేపథ్యంలో పశుసంవర్ధక శాఖ అధికారులు 4 నెలల నుంచి 8 నెలల వయసు దూడలకు మంగళవారం నుంచి టీకాలు వేయడం ప్రారంభించారు.

- ఆవుదూడల్లో ఎక్కువగా ప్రబలుతున్న వ్యాధి
- నిర్లక్ష్యం చేస్తే పశువుల మృత్యువాత
- ఒకదాని నుంచి మరొక పశువుకు వ్యాప్తి..
- 4 నెలలు దాటిన ప్రతి పశువుకూ టీకా తప్పనిసరి
- వచ్చే నెల 18వ తేదీ వరకు వ్యాధి నిరోధక టీకాలు





ఆవు దూడలకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

సాక్షి, అనకాపల్లి: మనుషుల్లో ఎలా అయితే సీజనల్ జ్వరాలు, అంటు వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయో.. అదే విధంగా పాడి పశువుల్లోనూ వర్షాకాలంలో ఎక్కువగా ప్రబలుతూ ఉంటున్నాయి. ఈ సీజన్‌లో పశువుల్లో ఎక్కువగా బ్రూసెల్లోసిస్ వ్యాప్తి చెందుతోంది. ఆవుదూడల్లో ఈ వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఇది ఒక పశువుకు వస్తే..దాని నుంచి మరొక పశువుకు గాలి ద్వారా వ్యాప్తి చెందుతోంది. ఈ వ్యాధి తీవ్రతరమై పశువులు మృత్యువాత పడుతుంటాయి. ఈ వ్యాధి ప్రారంభ దశలోనే గుర్తించి టీకాలు వేయిస్తే ప్రాణాపాయం తప్పుతుంది. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ టీకా కార్యక్రమాలు ఈ నెల 20 నుంచి వచ్చే నెల 18వ తేదీ వరకూ చేపడుతోంది. ఇందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా పశువైద్యాధికారులు బ్రూసెల్లోసిస్ వ్యాధి టీకాలు వేస్తున్నారు.

వ్యాధి లక్షణాలు ఇవే..

దేశవాళి పశువుల్లో కన్నా సంకరజాతి పశువుల్లో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పికోర్నా విరడే కుటుంబానికి చెందిన అఫ్తోస్ వైరస్ సోకిన దాదాపు ఒక వారం తర్వాత జ్వరం వస్తుంది. ఈ జ్వరం 103–106 డిగ్రీల ఫారెన్ హీట్‌కు పెరుగుతోంది. పశువుల నోట్లో, చిగుళ్లపై పొక్కులు ఏర్పడడం, మేత, నీళ్ల తీసుకోలేక నీరసించిపోతాయి. నోరు, గిట్టల మధ్యలో బొబ్బలు ఏర్పడడం, 2–3 వారాల్లో అవి చితికి పుండ్లుగా మారతాయి. నోటి నుంచి చొంగ కారుతుంది. జ్వరం, బలహీనత, చూడి ఆఖరి దశలో గర్భస్రావం, మాయ వేయకపోవడం, చూడి నిలబడకపోవడం, మగ పశువులలో వృషణాల వాపులు, కీళ్ల వాపు, వంధ్యత్వం రావడం వంటివి వ్యాధి లక్షణాలు. వ్యాధి సోకిన పశువుల గర్భస్రావాలు, మాయ, పాల ద్వారా ఈ వ్యాధి ఇతర జంతువులకు వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన పశువుల నుంచి మనుషులకు సోకుతుంది. నాలుగు నుంచి ఎనిమిది నెలల వయసు గల ఆడపెయ్యలకు తప్పనిసరిగా టీకా వేయించుకోవాలి. పాలను బాగా మరిగించి మాత్రమే పాడి రైతులు వినియోగించుకోవాలి.

జిల్లాలో పశువుల వివరాలు ఇలా..

- జిల్లాలో మొత్తం 7.20 లక్షల వరకూ పశువులు
- వీటిలో 5.20 లక్షల గేదెలు, 1.40 లక్షల ఆవులు, 60 వేల వరకూ ఆవుదూడ, గేదె పెయ్యిలు
- జిల్లాలో బ్రూసెల్లోసిస్ టీకాలకు 1.85 లక్షల పశువులు గుర్తింపు

ప్రతి పాడిరైతు సద్వినియోగం చేసుకోవాలి..



జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా బ్రూసెల్లోసిస్ వ్యాధి టీకాల కార్యక్రమం 29 రోజుల పాటు నిర్వహిస్తున్నాం. ఈ టీకాలు నాలుగు నెలలు దాటిన దూడ నుంచి ప్రతీ పశువుకు ముందస్తుగా వేయించాలి. కొద్దిపాటి ఎండకు రొప్పడం, చూడి పశువులు ఈసుకుపోవడం, ఎద్దులలో పని సామర్థ్యం తగ్గుముఖం, చొంగ వంటి లక్షణాలుంటే వెటర్నరీ వైద్యులను సంప్రదించాలి. వ్యాధి సోకిన పశువులను వెంటనే మంద నుంచి వేరు చేసి ఉంచాలి. వీటి పాలు దూడలకు తాగించకూడదు. పశువుల పాకను క్రిమి సంహార మందులతో, వాషింగ్ సోడాతో కడగాలి. ఈ వ్యాధితో చనిపోయిన పశువులను సున్నపు గోతిలో పూడ్చాలి.

– డాక్టర్ బెహరా ప్రసాదరావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

క్లుప్తంగా

సన్యాసమ్మతల్లికి కేజీ వెండి హారం బహూకరణ



అమ్మవారికి కేజీ వెండి హారాన్ని అలంకరించిన దాతలు

దేవరాపల్లి : దేవరాపల్లి గ్రామ ప్రజల ఆరాధ్య దైవం సన్యాసమ్మతల్లికి కేజీ వెండి, పావు తులం బంగారంతో ప్రత్యేకంగా తయారీ చేసిన హారాన్ని దాతలు బహూకరించారు. దేవరాపల్లి శివారు అల్లుపురం గ్రామానికి చెందిన గొర్లె కురుమునాయుడు, దేముడమ్మల కుమారుడు గొర్లె కాశీ, తారప్రియ దంపతులు సుమారు రూ.1.45 లక్షల విలువ చేసే వెండి హారాన్ని ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడు సమక్షంలో మంగళవారం అందజేశారు. ఆలయ ధర్మకర్త లలితానాయుడు, గ్రామ పెద్దల సమక్షంలో వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు జరిపి వెండి హారాన్ని దాతలు అమ్మవారి మెడలో అలంకరించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ ధర్మకర్త లలితానాయుడు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో డా. వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వెత్సా రమేష్, వరదపురెడ్డి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా రావణాపల్లి జలాశయం



గొలుగొండ: రావణాపల్లి జలాశయం నిండుకుండలా కనువిందు చేస్తోంది. నెల రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి పూర్తిస్థాయిలో నీరు చేరింది. దాంతో జలాశయం దిగువన గొలుగొండ, నర్సీపట్నం మండలాలకు సంబంధించి 1400 ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందనుంది. ఇప్పటికే రెండు మండలాల్లో పూర్తిస్థాయిలో ఖరీఫ్ నాట్లు పూర్తయ్యాయి. ఖరీఫ్ సాగుకు రావణాపల్లి జలాశయం దిగువున్న రైతాంగానికి నీటి కొరత ఉండదని నీటిపారుదల శాఖాధికారులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితితో రైతుల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.

తక్షణమే పరిహారం, ప్యాకేజీలు చెల్లించండి

- నిర్వాసితులను ఆదుకోండి
- అధికారులకు రైతు నాయకుల వినతి



తహసీల్దార్ అంబేద్కర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు నాయకులు, రైతులు

నక్కపల్లి : విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం ఏపీఐఐసీకి భూములు ఇచ్చిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ, పరిహారం చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదని వైఎస్సార్‌సీపీ, సీపీఎంలకు చెందిన రైతు నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీకి చెందిన కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు, సర్పంచ్ తళ్ల భార్గవ్ తదితరులు నిర్వాసితులతో కలిసి ఆందోళన చేశారు. ఇండస్ట్రియల్ కారిడార్ కోసం మండలంలో చందనాడ, అమలాపురం, వేంపాడు, రాజయ్యపేట తదితర గ్రామాల్లో రైతులు నాలుగు వేల ఎకరాల భూములు త్యాగం చేశారన్నారు. భూసేకరణ సమయంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం వీరికి ఎకరాకు రూ.18 లక్షల చొప్పున మాత్రమే పరిహారం చెల్లించిందన్నారు. ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు పునరావాసం, ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించారన్నారు. నిర్వాసిత కుటుంబాల్లో మేజర్లు కలిగిన కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున, ఇళ్లు, పశువుల షెడ్లు కోల్పోయిన వారికి రూ.15 లక్షల చొప్పున ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు సైతం ప్యాకేజీ, పరిహారం ఇస్తామని హామీ ఇవ్వడంతో వీరంతా భూములు వదులుకున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ భూములు స్వాధీనం చేసుకోవడానికి రంగం సిద్ధం చేసిందని, గ్రామాల్లో సర్వే బృందాలను నియమించి బాధితుల తుది జాబితా గుర్తించే ప్రక్రియ ప్రారంభించిందన్నారు. ఈ సర్వేలో అర్హులు, గతంలో భూములు త్యాగం చేసిన వారిలో కొంతమంది నిర్వాసితుల పేర్లు నమోదు చేయడం లేదన్నారు.

స్థానికంగా ఉన్న నాయకులు కొంతమంది తమ పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్నట్టు తమ పేర్లు నమోదు చేయాలని అధికారులు, సర్వే బృందాలపై ఒత్తిడి చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయని వీసం రామకృష్ణ అన్నారు. వాస్తవ బాధితులకు నష్టపరిహారం చెల్లించకుండా కొత్తగా లబ్ధిదారుల పేర్లు జాబితాల్లో చేరిస్తే గనుక భారీ స్థాయిలో ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

పదేళ్ల క్రితమే నిర్వాసితుల జాబితాలు తయారు చేయడం జరిగిందని, ఆ మేరకు పరిహారం చెల్లించాలన్నారు. ఈమేరకు తహసీల్దార్ అంబేద్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ఆందోళనలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సూరాకాసుల గోవిందు, సీపీఎం మండల కన్వీనర్ ఎం. రాజేష్, నిర్వాసితులు గోవిందరావు, కృష్ణ, జి.గోవిందు పాల్గొన్నారు.

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

- డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విధానం 2024–29, ఎంఎస్ఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పాలసీ 2024–29, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 2024–29 రూపకల్పన ప్రక్రియ చేపట్టిందని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రియల్ యూనియన్ల ప్రతినిధులతో ప్రత్యేక జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, నిబంధనలను క్రమబద్ధీకరించడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా కృషి చేస్తామన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ఎటువంటి పరిశ్రమలను స్థాపిస్తే ఉపయుక్తంగా ఉంటుందో పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రియల్ యూనియన్లు, అసోసియేషన్ ప్రతినిధులు తమ సూచనలు, సలహాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి, రెవిన్యూ డివిజనల్ అధికారి చిన్నికృష్ణ, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరిప్రసాద్, వివిధ విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంస్కృత భాష పునరుద్ధరణకు కృషి అవసరం



భారతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాగేశ్వరరావు

అనకాపల్లి : సంస్కృత భాష పునరుద్ధరణకు గ్రంథాలయాలు, విద్యా సంస్థలు కృషి చేయాలని సంస్కృత భారతి సంస్థ రాష్ట్ర సంపర్క్, విశ్రాంత సంస్కృత అధ్యాపకుడు మహీధర్ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో మంగళవారం సంస్కృత భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి భారతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 14 ఏళ్ల వయస్సు నిండిన వారు పత్రాలయం ద్వారా ఇంటి నుంచే సంస్కృత భాషను నేర్చుకోవచ్చన్నారు. భారతీయులందరికీ సంస్కృతాన్ని వ్యవహారికంగా తీసుకురావడం కోసం స్పష్టమైన దృక్పథంతో సంస్కృతి భారతి సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా కృషి చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ప్రాచీన గ్రంథాల్లో దాగి ఉన్న విజ్ఞానాన్ని బహిర్గతపరచడమే కాకుండా ఆధునిక శాస్త్రీయ పరిశోధనలకు అనుగుణంగా సంస్కృత విజ్ఞానాన్ని అందరూ అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ భాషను జన బాహుళ్యంలో సహజ భాషగా తీసుకురావాల్సిన బాధ్యత పాలకులు, స్వచ్ఛంద సంస్థలపై ఆధారపడి ఉందన్నారు. జ్యోతిష పండితుడు కోమాళ్లపల్లి నందన శర్మ మాట్లాడుతూ భాషలను పుట్టించిన తల్లి సంస్కృత భాష అన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు విల్లూరి జైశ్రీమాన్ కొణతాల మార్బుల్ నాయుడు, ఆవుపాటి త్రినాథ్, జయంతి శివప్రసాద్, ఓం ప్రసాద్ పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

అనకాపల్లి : అనకాపల్లి–యలమంచిలి రైల్వే ట్రాక్‌పై చోడవరం మండలం వెంకన్నపాలెం పంచాయతీ నరసాపురం గ్రామానికి చెందిన దొడ్డి వెంకటరమణ(40) గుర్తు తెలియని రైలు కిందపడి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నట్టు దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారాం చెప్పారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలివి. వెంకటరమణ వృత్తిరీత్యా అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో అనకాపల్లి సిటీ పెప్సీ డీలర్‌గా ఉన్నాడు. అతను మధ్యవర్తిగా ఉండి ఇద్దరు వ్యక్తులకు సుమారుగా రూ.65 లక్షలు నగదు ఇప్పించాడు. ఇద్దరు వ్యక్తులు నగదు చెల్లించకపోవడంతో మధ్యవర్తిగా ఉన్న దొడ్డి వెంకటరమణపై ఫైనాన్షియర్లు ఒత్తిడి చేయడంతో మనస్థాపం చెందిన వెంకటరమణ రైలు కింద పడి మృతి చెందినట్టు సూసైడ్ నోట్‌ను బట్టి తెలుస్తోందని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులను ప్రభుత్వం ఆదుకోవాలి..

- ఆశ్రమ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు



కోటవురట్ల సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగులు

కోటవురట్ల : అనుమతులు లేకుండా ఆశ్రమం పేరుతో విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న నిర్వాహకులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు కోరారు. స్థానిక సీహెచ్‌సీని మంగళవారం సందర్శించిన ఆయన విషాహారం తిని తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్యంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మారడంతోనే విద్యార్థుల జీవితాలలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయన్నారు. గత ప్రభుత్వంలో అద్భుతంగా ఉన్న విద్యాలయాలు ఇపుడు పాతరోజుల్లోని పాఠశాలలుగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులపై నియంత్రణ కొరవడడం, పర్యవేక్షణ లేమి కారణంగా ఇటువంటి విషాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో పాసా ట్రస్ట్‌లో జరిగిన విషాహారం ఘటనలో ముగ్గురు విద్యార్థులు చనిపోవడం తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఇంకా సుమారు 70 మంది విద్యార్థులు వివిధ ప్రాంతాలలో చికిత్స పొందుతున్నారని వారందరినీ ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. మృతి చెందిన గిరిజన కుటుంబాలకు తక్షణమే నష్ట పరిహారం అందించాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్.ఎస్.నారాయణమూర్తిరాజు, సిద్ధాబత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అనధికార ఆశ్రమాలపై చర్య తీసుకోవాలి



డీఆర్వో దయానిధికి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

తుమ్మపాల : అనధికారిక నిర్వహణలో ఉన్న హాస్టళ్లు, అనాథ ఆశ్రమాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర విశ్వ విద్యాలయాల కన్వీనర్ జి.కిరణ్ కుమార్, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు ప్రసాద్ డీఆర్వో దయానిధికి వినతిపత్రం అందించారు. ఈ నెల 19న పరిశుద్ధాత్మ అగ్నిస్తుత ఆరాధన మందిరంలో జరిగిన ఘటనలో బాధిత బాలలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఘటనకు కారణమైన పరిశుద్ధాత్మ అగ్నిపునీత సంస్థపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులైన 92 మంది పిల్లలకు పునరావాసం కల్పించి వారి విద్యాభ్యాసానికి పూర్తి సహకారం అందించాలన్నారు. జిల్లాలో అనధికారికంగా నిర్వహిస్తున్న వసతి గృహాలు, అనాథ ఆశ్రమాల జాబితాను వెల్లడించి ఆయా సంస్థల నిర్వాహకులపై గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

డీఆర్వోకు బీజేపీ వినతిపత్రం

తుమ్మపాల : కోటవురట్ల హాస్టల్‌లో విషాహారం తిని మరణించిన పిల్లల కుటుంబాలకు ప్రభుత్వం అందించే రూ.10 లక్షలతో పాటు, నిర్వాహకుల నుంచి మరో రూ.10 లక్షలు ఇప్పించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జిల్లా నాయకులు డీఆర్వో బి.దయానిధికి వినతిపత్రం అందించారు.

అనధికార వసతి గృహాలను తక్షణమే మూసివేయాలని, ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎస్సీ/ఎస్టీ/బీసీ వసతిగృహాల్లో పేద పిల్లలు ఉండేలా అవగాహన చేయాలి. జిల్లావ్యాప్తంగా ఎటువంటి అనుమతి లేకుండా నిర్వహిస్తున్న అన్ని హాస్టళ్లను వెంటనే మూసివేయించి, అందులోని విద్యార్థులను బీసీ,ఎస్సీ,ఎస్టీ హాస్టళ్లలో చేర్పించాలన్నారు. బాధిత కుటుంబాల్లో ఒకరికి ఔట్ సోర్సింగ్ ద్వారా ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

చీడపీడల ఉధృతిని అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి : రానున్న వర్షాలను ఉపయోగించుకుని నారు సిద్ధంగా ఉన్నట్లయితే నాట్లు వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాట్లు వేసుకునేటప్పుడు ఆకు చివరలను తుంచి 20 ఇన్‌టూ 15 సెం.మీ దూరంలో కుదురుకు 2–3 మొక్కల చొప్పున నాటుకోవాలని, ఖరీఫ్‌లో చ.మీ.కు. 33 మూనలు ఉండేలా చూసుకోవాలని, నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ బాటలు తీయడం మంచిదని పేర్కొన్నారు. పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి కొంత వరకూ అదుపు చేయవచ్చని, ఎరువులు, కలుపు మందులు, పురుగు మందులు వేయడానికి ఇంకా పైరు పరిస్థితి గమనించడానికి ఈ బాటలు బాగా ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు, వరిలో తామర పురుగులు ఆశించవచ్చని, నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మీ.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని ఆయన కోరారు. నారుమడిలో బెట్ట పరిస్థితులు నెలకొంటే పొటాషియం నైట్రేట్ లేదా 19:19:19, 5 గ్రాములు లీటరు నీటికి కలిపి ఆకు తడిచేలా పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు టి.శ్రీలత, కె.వి.రమణ మూర్తి, వి.గౌరి, బి.భవాని, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి పాల్గొన్నారు.

చెరకు రైతులను క్షోభకు గురి చేయకండి

- ఏపీ రైతు సంఘం ప్రతినిధులు



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం ప్రతినిధులు

చోడవరం రూరల్: జిల్లాలోని చక్కెర కర్మాగారాలపైనే ఆధారపడి చెరకు పండిస్తున్న రైతాంగాన్ని ఫ్యాక్టరీల యాజమాన్యం క్షోభకు గురి చేస్తుందని ఎ.పి. చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు వెంకటరమణ(కాసుబాబు), రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. గత సీజన్‌లో చెరకు సరఫరా చేసిన రైతులకు జూన్ నెలాఖరుకు మొదటి విడతగా టన్నుకు రూ.2,500 చెల్లింపులు పూర్తి చేస్తామని చోడవరం సుగర్స్ ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయని దుయ్యబట్టారు. ఫిబ్రవరి 16 నుంచి మార్చి 12వ తేదీ వరకు చెరకు సరఫరా చేసిన 6,346 మంది రైతులకు మొదటి విడత పేమెంట్ కింద రూ.15.32 కోట్ల బకాయిలు, చివరి విడత కింద టన్నుకు రూ.419.75 బకాయిల చెల్లింపుల ఊసేలేదని ప్రశ్నించారు. గత సీజన్‌లో ఒక లక్ష 70 వేల 601 మెట్రిక్ టన్నుల చెరకు చేసి, లక్షా 46 వేల 309 క్వింటాళ్ల పంచదార, 19 లక్షల 4 వేల యూనిట్ల విద్యుదుత్పత్తి చేసినా రైతులకు, కార్మికులకు బకాయిల పడడంతో రానున్న సీజన్ ప్రశ్నార్థకంగా మారిందని వాపోయారు. చెరకు రైతుల ఈతిబాధలు పట్ల అటు ప్రభుత్వాలు, ఇటు ఫ్యాక్టరీల యాజమాన్యాలు గుర్తెరిగి పని చేయాలని కోరారు. వారికి బకాయి పడిన పేమెంట్లను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు చెరకు రైతు సంఘం తరపున వినతి పత్రం అందించనున్నట్లు తెలిపారు.

అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేయాలి



సినీ గాయకుడు శ్రీకృష్ణకు పుస్తకం అందిస్తున్న విజయ్ ప్రకాష్

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల 48వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రెండు రోజుల పాటు విద్యార్థులకు 'గాతా రహే మేరా దిల్' పేరిట పాటల పోటీలను నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన సినీ నేపథ్య గాయకుడు శ్రీకృష్ణ, కీబోర్డు ప్లేయర్ రవిశేఖర్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పాటల పోటీల్లో విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచారని కొనియాడారు. అనంతరం శ్రీ కృష్ణ తన పాటల ద్వారా ఆహుతులను అలరించారు. రవి శేఖర్ కీబోర్డు పై పలు పాటలను వినిపించి ఉత్సాహపరిచారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్‌ప్రకాష్ విజేతలకు బహుమతులను అందజేశారు.

వైద్య సేవలపై ఇంత నిర్లక్ష్యమా!



ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌తో రోగుల సమస్యల గురించి మాట్లాడుతున్న వెంకన్న తదితరులు



ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న వెంకన్న

- మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రిలో అసౌకర్యాల కొరత
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న

మాడుగుల రూరల్ : మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రి సమస్యలతో సతమతమవుతుందని, రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న అన్నారు. సోమవారం ఆయన మండల కార్యదర్శి ఇ.నర్సింహమూర్తి తదితరులతో కలిసి ఆస్పత్రిని సందర్శించారు. రోగులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో 8 మంది వైద్యులకు గాను ఏడుగురు వైద్యులు వుండగా, వీరిలో ఒక వైద్యాధికారి ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమానికి హాజరవుతారని అన్నారు. సోమవారం మాత్రమే రోగులకు అవసరమైన మందులు ఇస్తున్నారని, కొన్ని వైద్య పరీక్షలకు ఘాట్‌రోడ్డులో గల ప్రైవేటు ల్యాబ్‌లకు పంపిస్తున్నారని స్థానిక ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. వర్షం వస్తే ఆస్పత్రి భవనం కారిపోతుందని, విద్యుత్ సరఫరా నిలిచిపోతే జనరేటర్ సదుపాయం కూడా లేదన్నారు. ఎక్స్‌రే సదుపాయం కూడా లేదని, డెంటల్, ఫిజియోథెరపీ వైద్యులు లేరని అన్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న నూతన భవనాలకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోడం వల్ల భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. రూ.5.30 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న భవనాలను సత్వరం పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట దేవరాపల్లి సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర, మండల నాయకురాలు కె.భవానీ పాల్గొన్నారు.

కోల్‌కతాలో వైద్యురాలిపై దురాగతం సిగ్గుచేటు



అనకాపల్లిలో న్యాయస్థానం వద్ద బార్ అసోసియేషన్ కమిటీ సభ్యుల ధర్నా



కొత్తూరు జంక్షన్‌లో విద్యార్థుల మానవహారం

అనకాపల్లి : కోల్‌కతాలో యువ మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనలో బాధితురాలి కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జె.వి.ఎస్ కుమార్ అన్నారు. స్థానిక న్యాయస్థానాల వద్ద న్యాయవాదులు మంగళవారం నల్లబ్యాడ్జిలు ధరించి ధర్నా చేశారు. దోషులు ఎంతటివారైన కఠినంగా శిక్షించాలన్నారు. దేశంలో మహిళల భద్రతకు ఎంతో ప్రాధాన్యం ఉన్న రాజ్యాంగంపై న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయేలా బెంగాల్ ప్రభుత్వ పనితీరు ఉందన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఈ కేసును సీబీఐకు అప్పగించిందని, నేరస్తులు భయపడి అదే రోజు అర్ధరాత్రి వందలమంది గూండాలతో దాడి చేసి నేర స్థలమైన సెమినార్ హాల్‌ను పూర్తిగా ధ్వంసం చేసి సాక్ష్యాలు తారుమారు చేసే ప్రయత్నం చేశారని, దీనిని బట్టి ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖుల ప్రమేయం ఈ కేసులో ఏమేరకు ఉందో ప్రజలకు అర్థమైందన్నారు. ఒక మహిళ ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రంలో మహిళపై ఇటువంటి దురాగాతం జరడం సిగ్గుచేటన్నారు. నేర విచారణకు తక్షణమే ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి త్వరితగతిన విచారణ జరిపి నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.ఎస్.దుర్గారావు, ఉపాధ్యక్షురాలు రోజా, సహాయ కార్యదర్శి తులసి, లేడీ రిప్రజెంటేటివ్ కుసుమ, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేపట్టారు. సీపీఎం జిల్లా నాయకులు గంటా శ్రీరామ్, డీడీ వరలక్ష్మి, కొళ్ల తెలయ్యబాబు పాల్గొన్నారు.

నిందితుల్ని కఠినంగా శిక్షించాలి

చోడవరం రూరల్ : కోల్‌కతాలోని ఆర్.జి కార్ ఆస్పత్రి వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం సీపీఎం నాయకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు.


సీఐటీయూ, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి నిరసన ప్రదర్శన చేసి కొత్తూరు జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా మహిళా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు రక్షణ లేకుండా పోతుందని, పని ప్రదేశాల్లో అసలే దిక్కులేని పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఢిల్లీ నడిబొడ్డులో నిర్భయ వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ దోషుల్లో భయం లేకుండా పోయిందని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వేలాది మంది ప్రాణాలు కాపాడే వైద్యుల ప్రాణాలకే రక్షణ లేకుండా పోయిందని, ఇదీ భారత సమాజం తీరుగా మారిందన్నారు. సీఐటీయూ నాయకులు ఆర్.దేముడునాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బార్లా.. బెల్టు షాపులు



మార్టూరులో అక్రమ మద్యం దుకాణం





కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. ఎన్నికల ముందు చెప్పినట్లు తక్కువ ధరలకే నాణ్యమైన మద్యం హామీని తుంగలో తొక్కారు. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచే మద్యాన్ని పక్కదారి పట్టించి, తమవారికే చెందిన బెల్టుషాపుల్లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు 'మామూళ్ల'గా మిన్నకుండిపోతున్నారు. అనకాపల్లి మండల పరిధిలో మార్చి నుంచి ఇప్పటి వరకు దాదాపు ఆరు మాసాల్లో ఆరుగురే మద్యం కేసుల్లో అరెస్టయ్యారంటే అధికారుల వైఖరి ఎలా ఉందో తెలుసుకోవచ్చు.

- గ్రామాల్లో ఏరులై పారుతున్న అక్రమ మద్యం
- వీధి వీధినా వెలుస్తున్న బెల్టు షాపులు
- కొన్ని చోట్ల మద్యం డోర్ డెలివరీ
- ఆరు నెలల్లో ఆరుగురే అరెస్టు!

తుమ్మపాల: గత ప్రభుత్వ మద్యం పాలసీపై ఎన్నికల్లో తీవ్ర ఆరోపణలు చేసిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక కొత్త నాటకానికి తెర తీసారు. మద్యం అమ్మకాలపై విచారణ అంటూ, అడ్డగోలుగా మద్యం విక్రయాలను పెంచేశారు. మద్యం ధరలు తగ్గిస్తాం, నాణ్యమైన మద్యం తీసుకొస్తాం అని ఊదరకొట్టిన నాయకులు అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా కొత్త మద్యం పాలసీ ఊసే లేదు. కూటమి నాయకులే గ్రామాల్లో బెల్టుషాపుల్ని విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారు. ఫోన్ చేస్తే చాలు బడి, గుడి, బంకు, బైకు కాదేది మద్యం సరఫరాకు అనర్హం. ఫిర్యాదు చేసే వారి వివరాలు బయటికి వస్తుండటంతో సామాన్యులెవరూ బెల్టుషాపు నిర్వాహకులకు వ్యతిరేకంగా సాహసించట్లేదు.

సందు సందుకో బెల్టు షాపు

ప్రధానంగా తుమ్మపాల, మామిడిపాలెం, సంపతిపురం, కూండ్రం, కుంచంగి, బవులువాడ, దిబ్బపాలెం, కోడూరు, కొండుపాలెం, రేబాక, గోపాలపురం, మారేడుపూడి, గొలగాం, బట్లపూడి, పిసినికాడ లక్ష్మీదేవిపేట, పట్టణంలో శివారు ప్రాంతాల్లో బెల్టుషాపుల ద్వారా మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ఒక్కో గ్రామంలో కనీసం అరడజనుకు పైగా బెల్టుషాపులు వెలిశాయి. వీరికి ప్రభుత్వ దుకాణాల నుంచే మద్యం సరఫరా జరుగుతుండటం గమనార్హం. ఇందుకు కూటమి నాయకులే సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఫోన్ కొట్టు బాటిల్ పట్టు

ఇటీవల పట్టణంలో మద్యం బాటిళ్ల భారీ డంప్‌తో ప్రభుత్వ మద్యం దుకాణం సూపర్‌వైజర్ దొరకడం, కొత్తూరులో కూడా మద్యం బాటిళ్లతో ఉద్యోగి దొరకడం అనకాపల్లిలో సంచలనంగా మారింది. అధికారులతో పరిచయాలు ఉండటంతో వారిపై ఎలాంటి చర్యల్లేవు. మందుబాబులు ఫోన్ చేస్తే చాలు 5 నిముషాల్లో వారు కోరుకున్న చోటుకి మద్యం డెలివరీ చేస్తున్నారు. బెల్టుషాపులో మద్యం అరువివ్వక పోవడంతో మార్టూరు గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ పోలీస్ స్టేషన్ వరకూ వెళ్లింది. అయినా పోలీసుల చర్యల శూన్యం.

మద్యం అక్రమ రవాణా ఇలా..

వాస్తవానికి మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరకే మద్యం విక్రయించాలి. అది కూడా ఒక్కో వ్యక్తికి 3 బాటిళ్ల మించి విక్రయించరాదు. దీంతో ప్రభుత్వ దుకాణాల్లోని కొందరు సిబ్బందే బెల్టుషాపుల నిర్వాహకులతో చేయి కలిపి ఒక్కో సీసాపై రూ.10 నుంచి రూ.20 చొప్పున తీసుకొని మందును నేరుగా అందిస్తున్నారు. అలా సేకరించిన మద్యంపై సీసాకు రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా వేసి బెల్టుషాపు నిర్వాహకులు దోచుకుంటున్నారు.

ప్రీమియం బ్రాండ్లు పక్కదారి

మద్యం ప్రియులు ఎక్కువగా వాడే బ్రాండ్లపై ప్రభుత్వ దుకాణాల్లో పనిచేసే సిబ్బంది కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఏ సమయంలో వెళ్లి అడిగినా ఆ బ్రాండ్ల స్టాక్ అయిపోయినట్లు చెప్తున్నారు. మధ్యాహ్నం అడిగితే స్టాక్ అయిపోయిందని, ఉదయం అడిగితే ఇంకా స్టాక్ రాలేదని చెప్తూ, ఆ బ్రాండ్లు వచ్చిన వెంటనే దారి మళ్లిస్తున్నారు. ఆయా బ్రాండ్ల మద్యాన్ని బెల్టుషాపు నిర్వాహకులకు అందించేస్తున్నారు. దీంతో మద్యం ప్రియులు అధిక ధరలు వెచ్చించి బెల్టు షాపుల్లో వీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది.

ఆరు నెలల్లో ఆరుగురే అరెస్టు

బెల్టు షాపు నిర్వాహకులపై ఉక్కుపాదం మోపుతామని చెప్తున్న అధికారులు క్షేత్రస్థాయిలో ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో బెల్టు షాపులు కొనసాగుతున్నా పట్టించుకున్న పాపాన పోవట్లేదు. రాజకీయ ఒత్తిళ్లు, నెల వారీ మామూళ్లతో పండగ చేసుకుంటున్నారు. అన్నీ తెలిసినా, తెలియనట్లే నటిస్తూ అక్రమ మద్యం వ్యాపారానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ప్రజలు బాహాటంగానే ప్రభుత్వ, అధికారుల తీరును ఆక్షేపిస్తున్నారు. ఆన్‌లైన్, రాతపూర్వక ఫిర్యాదులపై మాత్రమే విచారణ చేసి కేసులు నమోదు చేస్తున్నారు.

ఆరు మాసాల్లో చర్యలివే..

- 42 మందిపై 39 కేసులు
- ఆరుగురికి రిమాండ్
- మూడు వాహనాల సీజ్
- పట్టుకున్న మద్యం 275.67 లీటర్లు
- బీరు బాటిళ్లు 29.55 లీటర్లు

పోలీసులకు ఫిర్యాదు చేసినా..



గ్రామాల్లో అక్రమ మద్యం ఏరులై పారుతోంది. బెల్టుషాపుల నిర్వాహకులు ఒక్కో బాటిల్‌పై కనీసం రూ.50 అదనంగా వేసుకుని విక్రయిస్తున్నారు. మందుబాబుల మధ్య గ్రామాల్లో నిత్యం ఘర్షణలు జరుగుతున్నాయి. యువకులు మద్యం మత్తులో తల్లిదండ్రులపైనా దాడులు చేస్తున్నారు. ఆలయాలు, జంక్షన్ల వద్ద యువత పేకాట, మందు శిబిరాలు ఏర్పాటు చేసి, ఆ వేపుగా వచ్చే మహిళలు, యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదు. అక్రమ మద్యం అమ్మకాలపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఇదలాడ బ్రహ్మాజీ, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు, అనకాపల్లి

అక్రమ మద్యంపై కఠిన చర్యలు



ప్రభుత్వ మద్యం దుకాణాల్లో తప్ప ఇతర ప్రదేశాల్లో మద్యం విక్రయాలు చేపడితే కేసులు నమోదు చేస్తున్నాం. మార్చి నుంచి ఇప్పటి వరకు 42 మందిపై 39 కేసులు నమోదు చేశాం. ప్రభుత్వ దుకాణాల నుంచి బెల్టు షాపులకు తరలిస్తున్న మద్యంపై నిఘా పెట్టాం. నిబంధనలకు విరుద్ధంగా 3 బాటిళ్ల కన్నా ఎక్కువ మద్యంతో దొరికితే వారిని వెంటనే రిమాండ్‌కు తరలిస్తున్నాం. అక్రమ మద్యం, బెల్టుషాపులు, డోర్ డెలివరీ మద్యంపై ఫోన్ నెం.63054 11142కు సమాచారం ఇస్తే తక్షణ చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదీల వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– అనిల్‌కుమార్, సీఐ, ఎస్ఈబీ, అనకాపల్లి

క్లుప్తంగా

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కశింకోట: దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా స్థానిక పంచాయతీ ప్రధాన రహదారిలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. దేశ ప్రధానిగా సైన్స్, సాంకేతిక రంగంలో ఆయన అందించిన సేవల్ని కొనియాడారు. పార్టీ నాయకులు కత్తెర శ్రీధర్, మలపురెడ్డి కోటేశ్వరరావు, తగరంపూడి గణపతి, సూరా శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యా కమిటీ మాజీ చైర్మన్‌కు సత్కారం



విద్యా కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న హెచ్‌ఎం స్వర్ణకుమారి

కశింకోట: స్థానిక బాలికల హైస్కూల్ విద్యా కమిటీ మాజీ చైర్మన్ యల్లపు శ్రీనివాసరావు దంపతులను పాఠశాలలో ఘనంగా సన్మానించారు. దుశ్శాలువా కప్పి, జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది మాట్లాడుతూ గత ఐదేళ్లలో స్కూలు అభివృద్ధికి ఆయన అందించిన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మోస్తరు వర్షం

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున మోస్తరు వర్షం కురిసింది. నల్లని మేఘాలు కమ్ముకుని, చినుకులు మొదలయ్యాయి. వాతావరణం చల్లబడింది. వరి నారుమళ్లకు ఈ వర్షం కాస్త ఉపకరిస్తుందని రైతులు చెప్తున్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

యలమంచిలి రూరల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్, మేథ్స్ గెస్ట్ లెక్చరర్స్‌గా పనిచేసేందుకు, అర్హులైన అభ్యర్థులు కళాశాలలో సంప్రదించాలని యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 175 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,110	5,100
రెండో రకం	3,670	3,870
మూడోరకం	3,200	3,380

అనకాపల్లి సినిమాలు

పాగల్ V/Sకాదల్	: రాజా(మార్నింగ్, ఫస్ట్‌షో)
సంఘర్షణ	: రాజా (మ్యాట్నీ, సెకండ్‌షో)
తంగలాన్	: సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు	: సత్యనారాయణ స్క్రీన్-2
సింబా	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
డబుల్ ఇస్మార్ట్	: వెంకటేశ్వర
మిస్టర్ బచ్చన్	: శ్రీసత్య
డబుల్ ఇస్మార్ట్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 49 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-25 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైనవారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 389 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 354 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ఘనంగా మరిడిమాంబ సారె ఊరేగింపు



మరిడిమాంబ సారె ఊరేగింపులో మహిళలు

అనకాపల్లి: స్థానిక కోట్నివీధి మరిడిమాంబ అమ్మవారి పండగ పురస్కరించుకుని మంగళవారం అమ్మవారి సారె ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కోట్ని పూర్ణచంద్రహరినాథ్ స్థానిక మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 22న అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పండగలో భాగంగా బుధవారం రాత్రి సినీ డూప్స్ హంగామా స్టేజ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. 22న తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, రాత్రి నేల వేషాలు, స్టేజ్ ప్రొగ్రాంలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అమ్మవారి సారె ఊరేగింపులో స్థానిక భక్తులు తాము తయారు చేసిన పిండి వంటల్ని తలపై పెట్టుకుని పురవీధుల్లో ఊరేగి, ఆలయానికి చేరుకున్నారు. పిండి వంటల్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి, భక్తులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు తలారి లక్ష్మీప్రసాద్, కోట్ని రామకృష్ణ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో లక్ష్మీనారాయణ పూజ



సామూహిక లక్ష్మీనారాయణ పూజలు చేస్తున్న మహిళలు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి అమ్మవారి ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయంలో మంగళవారం సామూహిక లక్ష్మీనారాయణ పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీ అష్టలక్ష్మీ పీఠాధిపతి వ్యవస్థాపకులు గోదా చరణ మంజీర పీతాంబరం రఘునాథాచార్య ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో 100 మంది మహిళలు పాల్గొన్నారు. పూజలో పాల్గొన్న భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై అదనపు శ్రద్ధ



తుమ్మపాల విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రికార్డులను పరిశీలిస్తున్న లూసీ కార్డీలియా

అనకాపల్లి: గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికల ఆరోగ్య సంరక్షణపై వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు దృష్టి సారించి, రక్తపరీక్షలు చేయాలని వైద్య విభాగం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం వైద్యురాలు లూసీ కార్డీలియా సూచించారు. మండలంలోని తుమ్మపాల సచివాలయం-2 పరిధి విలేజ్ హెల్త్ క్లినిక్‌ను మంగళవారం సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు అందుతున్న సేవలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. రోగులకు సకాలంలో వైద్యం అందించినట్లయితే ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చన్నారు. తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యులు షమీమ్, వాణీజగదీశ్వరి, డీపీవో జగదీష్, ఎస్‌వో రామచంద్రరావు, వైద్య సిబ్బంది ప్రియదర్శిని, శారద, బి.మంగమ్మ, బి.సంఘం, ఒ.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శిథిల రహదారులతో చిక్కులు

- ధ్వంసమైన లంకెలపాలెం కూడలి రహదారి
- గుంతలు పడిన మడకపాలెం రోడ్డు



మడకపాలెం వద్ద అధ్వానంగా మారిన రహదారి

పరవాడ: లంకెలపాలెం-అనకపల్లి రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్టీపీసీ షైయాష్ చెరువుల నుంచి వందల సంఖ్యలో బూడిద లారీలు నిత్యం ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుండడంతో రహదారి మొత్తం ధ్వంసమైంది. ఎక్కడికక్కడ భారీ గుంతలు, బీటలు పడడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నా రు. ద్విచక్ర వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయ ని పలువురు వాపోతు న్నారు. లంకెలపాలెం కూడలిలో ఏర్పడిన భారీ గుంతలు ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఈ గోతుల్లో పడి బోల్తా పడుతున్నాయి. మడకపాలెం వద్ద పరుజులో భారీ గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి వేళల్లో ప్రయాణికులు ఈ గుంతలను గుర్తించకుండా రాకపోకలు సాగించడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. పెదముషిడివాడ వద్ద భారీ గుంతలు ఏర్పడిన కారణంగా అనేక గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అదే విధంగా బూడిద లారీల ద్వారా ఎగసి పడుతున్న దుమ్ము, ధూళి కారణంగా అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన రహదారుల గురించి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ కనీస చర్యలు తీసుకోలేదని ప్రజలు వాపోతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు స్పందించి శిథిలమైన రోడ్లకు మరమ్మతులు నిర్వహించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'ప్రతి విద్యార్థి ఆంగ్లంలో మాట్లాడాలి'



స్కూలు కాంప్లెక్స్‌లో మాట్లాడుతున్న డీవైఈవో అప్పారావు

కశింకోట: పాఠశాలలో ప్రతి విద్యార్థికి ఆంగ్లంలో చదవడం, రాయడం, మాట్లాడటం రావాలని, ఇందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని యలమంచిలి ఉప విద్యాశాఖాధికారి ఎం.అప్పారావు సూచించారు. కశింకోటలోని డీపీఎస్ జెడ్పీ హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయులకు జరిగిన స్కూల్ కాంప్లెక్స్‌ను మంగళవారం ఆకస్మికంగా సందర్శించి, శిక్షణ తీరును పరిశీలించారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆంగ్ల ఉపాధ్యాయులతో మాట్లాడి, సంతృప్తి వ్యక్తం చేశారు. వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆంగ్లంలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం ఆచంట రవి, డీఆర్‌పీలు ఉన్నారు.

పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు



పాడి పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

సబ్బవరం : మండలంలోని గోటివాడ గ్రామంలో పాడి పశువులకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధికి మంగళవారం టీకాలు వేశారు. ఈ నెల 20 నుండి వచ్చే నెల 18 వరకూ గాలికుంటు వ్యాధి టీకాలతో పాటు 4 నుండి 8 నెలల వయసు గల ఆడపెయ్యలకు బ్రూసెల్లా టీకాలు వేయనున్నట్లు పశు వైద్యురాలు డాక్టర్ స్వర్ణలత తెలిపారు. అదే విధంగా గోటివాడతో పాటు అంతకాపల్లి, గుల్లేపల్లి గ్రామాల్లో సుమారు 150 పాడి పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. మండలంలోని పాడి రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది కె. వెంకటరమణ పాల్గొన్నారు.

హెల్త్ సెంటర్‌కు కుర్చీల వితరణ

మునగపాక: మండలంలోని నాగులాపల్లి పాటిమీద ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌కు అదే గ్రామానికి చెందిన ఆండ్ర మల్లేష్, మావూరి సంతోష్ కలిసి 15 కుర్చీలను మంగళవారం వితరణగా అందజేశారు. మన ఊరు-మన బాధ్యతలో భాగంగా తమవంతు సాయం అందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కుర్చీలను సెంటర్‌లో పనిచేసే ఉద్యోగులకు అప్పగించారు.

యోగాతో ఆరోగ్యకర జీవితం



మాజీ ఎంపీ బీవీ సత్యవతిని సత్కరిస్తున్న అగస్త్య దివ్యజ్ఞాన సమాజం ప్రతినిధులు



యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

అనకాపల్లి: ప్రస్తుత స్పీడ్ యుగంలో ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురై, అనారోగ్యంతో బాధపడుతున్నారని, నిత్యం యోగాతో ఆరోగ్యంగా జీవించవచ్చని మాజీ ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక శారదానగర్ మెయిన్‌రోడ్డులో శ్రీ అగస్త్య దివ్యజ్ఞాన సమాజం, రామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్, పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో యోగాపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం, ఆనందకర జీవనానికి యోగా, ధ్యానం మన జీవన విధానంలో ఓ భాగం కావాలన్నారు. ములో భాగమైఉండాలన్నారు. యోగా ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు వయసు పెరుగుతున్నకొద్దీ ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని సూచించారు. అనంతరం మాజీ ఎంపీని శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో దివ్యజ్ఞాన సమాజ అధ్యక్షుడు డాక్టర్ రేపాటి రామసత్యనారాయణ, కార్యదర్శి కాండ్రేగుల మురళీకృష్ణ, హార్ట్‌ఫుల్‌నెస్ జోనల్ కోఆర్డినేటర్ ఉప్పల లక్ష్మయ్య, అనకాపల్లి సెంటర్ కోఆర్డినేటర్ జి.మంగయ్య, పతంజలి యోగా గురువు భీశెట్టి దొరమ్మనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో దోమల నియంత్రణ



గవరపాలెం మలేరియా కార్యాలయంలో దోమల నివారణకు ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది



కశింకోట పీహెచ్‌సీలో దోమల నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

అనకాపల్లి: దోమల రహిత సమాజం.. ఆరోగ్యానికి సోపానం అంటూ ప్రపంచ దోమల దినోత్సవాన్ని స్థానిక గవరపాలెం మలేరియా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా మలేరియా అధికారి కె.వరహాలుదొర మాట్లాడుతూ ఆడ ఎనాఫిలిస్ దోమల వల్ల మలేరియా సోకుతుందన్న విషయాన్ని 1897 ఆగస్టు 20న రొనాల్డ్‌రాస్ కనుగొన్నట్లు తెలిపారు అప్పటి నుంచి ఏటా ఆ రోజున ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. అంతకు ముందు గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆర్చ్ నుంచి శాంతినగర్ వరకు దోమల నియంత్రణకు ప్రజలతో కలిసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ చేపట్టి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది పీజేఎంఆర్ నాయుడు, పి.శంకరరావు, ఆర్‌పీ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా వైద్య, ఆరోగ్య సిబ్బంది మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సమాజ భాగస్వామ్యంతో దోమల నివారణకు కృషి చేస్తామని సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి తిరుపతిరావు మాట్లాడుతూ దోమలు నీరు నిల్వ ఉన్నచోట గుడ్లు పెట్టి వ్యాప్తి చెందుతాయన్నారు. అవి పెరగకుండా ప్రతి శుక్రవారం దోమల నివారణకు ఇల్లు, ఇంటి పరిసరాల్లోని పాత్రలు, టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు తదితరాల్లో నీరు నిల్వ లేకుండా డ్రై డే పాటించాలన్నారు. పరిసరాల్ని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని, ఇళ్లలో పొగపెట్టి దోమలను తరిమేయాలన్నారు. జ్వరం వస్తే రక్త పరీక్షలు జరిపించుకుని, చికిత్స పొందాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ రామ్మూర్తి, పీహెచ్ఎన్‌లు సత్యవతి, విజయలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ శివాజీ, పారా మెడికల్, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలను విజయవంతం చేయండి

కోటవురట్ల : ఈ నెల 23న జరగనున్న ప్రత్యేక గ్రామసభలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, అగ్రికల్చర్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమస్యల గుర్తింపుపై నిర్వహించనున్న ప్రత్యేక గ్రామసభలకు విధిగా అధికారులు హాజరు కావాలన్నారు. ముందుగా ప్రజలకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఏపీఎం రమణకుమారి, ఏపీవో గంగునాయుడు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



వాడ్రాపల్లిలో ర్యాలీ ప్రారంభిస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. వాడ్రాపల్లిలో మంగళవారం దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీజన్‌లో అంటు రోగాలు ప్రబలకుండా చూడాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌ శిక్షణ తరగతుల పరిశీలన



హిందీ శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న జిల్లా అకడమిక్ మోనటరింగ్ అధికారి పట్నాయక్

మునగపాక: తిమ్మరాజుపేట, నాగులాపల్లి హైస్కూళ్లలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను మంగళవారం జిల్లా అకడమిక్ మోనిటరింగ్ అధికారి ఎం.ఎం.పట్నాయక్ పరిశీలించారు. తిమ్మరాజుపేట హైస్కూ ల్లో హిందీ శిక్షణ తరగతులను పరిశీలించిన ఆయన బోధన పద్ధతులు మరింత పెంచాలన్నారు. ఉపాధ్యాయులు సంబంధిత భాషపై మరింత పట్టు సాధించాలన్నారు. ఇటువంటి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట పరిశీలకులు ఎం.శివనాయుడు, హెచ్ఎం జి.అప్పారావు, సీఆర్ఎంటీ కె.లక్ష్మీనారాయణ, ఆర్‌పీలు చందన, దేవకి, శైలజ తదితరులున్నారు.